శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## ఆంధ్రప్రదేశ్ లో ఎన్ని వన్‌ధన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు?

❖ ఎంపి వేమిరెడ్డి ప్రశ్న



**నెల్లూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్ ధన్ వికాస్ కేంద్రాలు(వీడివికె) ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ఏర్పాటు చేశారో తెలియజేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం లోక్‌సభలో ఆయన గిరిజన ఉత్పత్తుల మార్కెటింగ్‌పై పలు అంశాలు ప్రస్తావించారు. గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి టిఆర్ఐఎఫ్ఈడి ఎంతమేర సహకారం అందిస్తుందో తెలియజేయాలన్నారు. గిరిజనులు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించడానికి కేంద్ర, రాష్ట్రాలు అందిస్తున్న ప్రోత్సాహంపై ఆరా తీశారు. గత రెండు సంవత్సరాలు, ప్రస్తుత సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఆన్‌లైన్‌లో విక్రయించబడిన గిరిజన ఉత్పత్తుల విలువ ఎంత అని ప్రశ్నించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్ ధన్ వికాస్ కేంద్రాలు(వీడివికె) ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 488 ఏర్పాటు అయ్యాయని చెప్పారు. అందులో అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 166 కేంద్రాలు, శ్రీకాకుళంలో 106 కేంద్రాలు, విశాఖపట్నంలో 98 కేంద్రాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అత్యల్పంగా నెల్లూరు జిల్లాలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రధానమంత్రి జనజాతీయ వికాస్ మిషన్ పథకం కింద, టిఆర్ఐఎఫ్ఈడి ద్వారా గిరిజన కళాకారుల అభివృద్ధి, వారికి వివిధ గిరిజన ఉత్పత్తుల సేకరణ, పరికరాల అందజేత, అలాగే ప్రాథమిక, ద్వితీయ స్థాయి ప్రాసెసింగ్‌ను సులభతరం చేయడానికి శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. తద్వారా ట్రైబ్స్ ఇండియా అవుట్‌లెట్లు, నిశామర్స్ ప్లాట్‌ఫామ్స్, ఆది మహోత్సవ్, ఆది బజార్ మొదలైన ఎగ్జిబిషన్ల ద్వారా గిరిజన ఉత్పత్తుల రిటైల్ మార్కెటింగ్‌ను చేపడుతున్నామన్నారు. టిఆర్ఐఎఫ్ఈడి ఆధ్వర్యంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ద్వారా గిరిజన ఉత్పత్తులను ఇకామర్స్ ప్లాట్‌ఫాంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. గత రెండు సంవత్సరాలు, ప్రస్తుత సంవత్సరంలో(31.01.2025 వరకు) ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.16.64 లక్షల విలువైన గిరిజన ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయించబడ్డాయని కేంద్ర సహాయమంత్రి తెలియజేశారు.

## కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోండి

❖ అసెంబ్లీలో ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తి



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరులోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఉన్న కోవూరు షుగర్ ఫ్యాక్టరీ లో పనిచేసిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు షుగర్ ఫ్యాక్టరీ లో గతంలో 3 వేలకు పైగా కార్మికులు పనిచేసేవారన్నారు. వారిలో ఇప్పటికే చాలా మంది మరణించారని, పనిచేసిన కార్మికులకు జీతాల బకాయిలు 20 కోట్ల వరకు ఉన్నాయన్నారు. 6 సార్లు ఎమ్మెల్యే అని చెప్పుకుని తిరిగే మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కేవలం కమిషన్ల కోసం కార్మికుల జీతాలు చెల్లించకుండా నిలిపివేశారని ధ్వజమెత్తారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కార్మికుల బకాయిలు చెల్లించి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా 14 ఎకరాల విస్తీర్ణంలో ఈ షుగర్ ఫ్యాక్టరీ భూములు ఉన్నాయని, వీటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని పెంచుకునే వీలుందని, ఇప్పటికే ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలోని రావూర్లపాడు గ్రామంలో ఇఫ్కో కిసాన్ సెజ్‌లో వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉందని, ఇందులో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఏ మేర కంపెనీలు రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ కిసాన్ సెజ్‌లో కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పరిశ్రమలు తరలివచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందుతాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## సదరంని తనిఖీ చేసిన కలెక్టర్



**నెల్లూరు, మార్చి 20, ప్రభాతవార్త – వైద్యం** నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న సదరం క్యాంపును జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికి అదే రోజు పరీక్షలు పూర్తి చేసి పంపించాలన్నారు. క్యాంపుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు, ఆహారం తదితర వసతులు కల్పించాలన్నారు. దివ్యాంగులకు ఐడీ కార్డులు ఇచ్చే పక్రియ వేగవంతం చేయాలన్నారు. వినికిడి పరికరాలు అవసరమైన వారికి గొలగమూడిలో సీఆర్‌సీ సెంటర్ అనుసంధానంతో వినికిడి పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి ఇన్‌ఛార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ మస్తాన్ భాషా, డాక్టర్ గంగాధర్ తదితరులు క్యాంపు నిర్వహిస్తున్న తీరును వివరించారు.

## పారిశుధ్య పనుల పర్యవేక్షణలో కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,మార్చి 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ సూర్యతేజ గురువారం వివిధ డివిజన్లో పర్యటించి స్థానిక పార్కులలో మోలిక వసతులు సౌకర్యాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా 40 వ డివిజన్ మూలపేట వాటర్ ట్యాంక్ పార్క్, 42 వ డివిజన్, ఏఆర్బి ఫంక్షన్ హాల్ బ్యాక్ ఖుద్దూస్ నగర్ పార్క్, అమీన్ నగర్ పార్క్, 44 వ డివిజన్ మహబూబ్ ఖాన్ పార్క్ నియర్ కలెక్టరేట్, 48 ఏపీజే అబ్దుల్ కలాం పార్క్, 47 గుప్తా పార్క్ లను సందర్శించారు. అన్ని పార్కులలో క్రీడా పరికరాలు, జిమ్ వస్తువులు, చిన్నారులకు ఆటవిడుపు పరికరాలు, వాకింగ్ ట్రాక్, బెంచీలు, పచ్చదనం, మరుగుదొడ్ల సౌకర్యం, మంచినీటి వసతి, పార్కుల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణం, విద్యుత్ వెలుగులు తదితర మోలిక సదుపాయాలను కల్పించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కుక్కలగుంట వెహికల్ షెడ్ ను కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా వెహికల్ షెడ్ ద్వారా జరుగుతున్న వివిధ కార్యక్రమాలను కమిషనర్ పర్యవేక్షించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, లాగ్ బుక్, డీజిల్ మీటర్ల రీడింగ్, వాహనాల మైలేజీ, వాహనాల మరమ్మతు పనులు, తదితర అంశాలను కమిషనర్ పర్యవేక్షించారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఏ.డీ ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీపీ, వైస్ ఎంపీపీల ఎన్నిక

**నెల్లూరు (కలెక్టరేట్), మార్చి 20, ప్రభాతవార్త** జిల్లాలోని విడవలూరు మండల అధ్యక్ష పదవి...దగదర్తి మండల ఉపాధ్యక్ష ఎన్నిక ఈ నెల 27న జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈఓ విధ్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయా మండలాల మండల ప్రజా పరిషత్ సభ్యులకు ఈ నెల 23న నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఏదైనా కారణాల వల్ల నిర్దేశించిన తేదీలో ఈ ఎన్నిక జరక్కపోతే మరుసటి రోజు 28న జరుగుతుందన్నారు.

## సోమశిల నీటిమట్టం



**ఆనంతసాగరం, మార్చి20, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయం లో 54.780టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 350, ఎన్‌ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు 500, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.165 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 20, ప్రభాతవార్త** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేసి జిల్లా పారిశ్రామిక పురోభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పిఎంఈజిపి రుణాల మంజూరు క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొద్దలైన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జీఎం మారుతి ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువు కంటే ముందుగా అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ముటేషన్స్ ను వెంటనే పూర్తి చేయవలసిందిగా కందుకూరు సబ్ కలెక్టర్, ఆత్మకూరు ఆర్డీవో లను ఆదేశించారు. అదేవిధంగా అవసరమైన సందర్భాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీ శాఖలు ఉమ్మడి తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్కుల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి ఇదివరకే ఆమంచర్ల వద్ద కేటాయించిన భూమికి బదులు కేకే గుంట, అనంతవరం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో వున్న భూమిని పరిశీలించి కేటాయించాలని ఏపీఐఐసీ అధికారులకు సూచించారు. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పిఎంఈజిపి రుణాలను విరివిగా మంజూరు చేయాలని సూచించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేసి నివేదిక పంపాలని ఏపీఐఐసి అధికారులను సూచించారు. నారంపేట మెగా ఇండస్ట్రియల్ పార్క్ వద్ద విద్యుత్, తాగునీరు ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమశిల జలాల కేటాయింపు గురించి సాధ్యాసాధ్యాల నివేదిక సమర్పించాలని సోమశిల ఎస్ ఈ ని ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులను మంజూరు చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, డ్వామా పిడి గంగా భవాని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీకాంత్ ప్రదీప్, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్, డిటిసి చందర్, కమిటీ సభ్యులు ఎపికె రెడ్డి, ఒమ్మిన సతీష్, శ్రీనివాసులు, భక్తవత్సలం, వెంకటేష్ , ప్రింటింగ్ క్లస్టర్ నిర్వాహకులు మల్లికార్జున్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## తలకు గాయం.. మొదటి గంట ఎంతో కీలకం

❖ గంటలోపు చికిత్స అందకపోతే కణాలు చనిపోతుంటాయి
❖ క్రిటికల్ కేర్ 24 గంటలు అందుబాటులో



**నెల్లూరు, మార్చి 20, ప్రభాతవార్త–వైద్యం** తలకు బలమైన గాయం తగిలిన వ్యక్తి ప్రణాలను కాపాడటంలో మొదటి గంట ఎంతో కీలకమని, గంటలోపు చికిత్స అందకపోతే ప్రతి సెకనుకు లక్షలాదిగా మెదడు కణాలు చనిపోతూ ఉంటాయని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ డైరక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ అన్నారు. ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హాస్పిటల్ డైరక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, న్యూరో సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ ఏవీ రమణమూర్తి, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్, హాస్పిటల్ ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, న్యూరో సర్జన్ డాక్టర్ ఉబేద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి 20న జరుపుకునే ప్రపంచ తల గాయాల అవగాహన దినోత్సవంలో తలకు బలమైనగాయాలు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, ప్రమాదవశాత్తు కిందపడిపోవడం, భవన శిధిలాల క్రింద పడటం.. కారణాలు ఏవైనా తలకు బలమైన గాయాలు తగిలితే దాని ప్రభావం మొదటగా మెదడుపై పడుతుందని, ఎక్కువగా శాతం మెదడుకు తీవ్రమైన గాయం తగిలే అవకాశం ఉందన్నారు. దీంతో జ్ఞాపకశక్తిని కోల్పోవడం, దృష్టి లోపాలు రావడం, తలనొప్పి, మానసిక స్థితిలో మార్పులు సంభవిస్తాయన్నారు. కారణం ఏదైనా తలకు బలమైన గాయాలు తగిలితే వెంటనే ఆ వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని వెల్లడించారు. బైక్ డ్రైవ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించడం, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించడం ఇతర సురక్షితమైన చర్యలు అవలంభించడం ద్వారా తలకు గాయాలు తగలకుండా ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆల్కహాలు, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపటం సరికాదన్నారు. అదే విధంగా రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించాలని తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. తలకు బలమైన గాయాలు తగిలిన వారికి అత్యవసర చికిత్స అందించేందుకు నెల్లూరులోని అపోల్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అవసరమైన ఎమెర్జెన్సీ, క్రిటికల్ కేర్ విభాగాలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ ఏవీ రమణమూర్తి, డాక్టర్ వెంకట్ తెలియజేశారు. క్రిటికల్ కేర్ విభాగంలో ప్రపంచ స్థాయి వైద్య సేవలతో అందిస్తామన్నారు. అంతే కాకుండా 24 గంటలు వైద్యులు, న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు, అనస్టీషియాలజిస్టులు, రేడియాలజిస్టులు, ట్రామా సర్జన్లు, ఆర్థో వైద్యులు, క్రిటికల్ కేర్ నిపుణులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అంతే కాకుండా నెల్లూరు అపోలో హాస్పిట్‌లో సిస్టెర్నోస్టమీ అనే కొత్త అధునాతన మెదడు శస్త్ర చికిత్సను ప్రారంభించామని, తలకు బలమైన గాయం తగిలి మెదడు దెబ్బతిన్న వారికి ఈ శస్త్ర చికిత్స చేస్తే రోగులు త్వరగా కోలుకుంటారని పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో వీరితో పాటు నెల్లూరు అపోలో హాస్పిటల్ యూనిట్ హెడ్ బాలరాజు, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి విష్ణాలయం వీధిలో జియస్‌టి కస్టమ్స్‌బృందం ఆకస్మికదాడులు

❖ ఆరు బంగారు షాపులపై ముమ్మర తనిఖీలు... భారీగా ట్యాక్స్...
❖ జియస్‌టి బృందంరాకతో షాపులు బంద్





**కావలి, మార్చి20 ప్రభాతవార్త** గుంటూరు నుంచి జియస్‌టి, కస్టమ్స్ అధికారుల బృందాలు నాలుగు కార్లల్లో దాదాపు 14 మంది ఉన్నపళంగా కావలి విష్ణాలయం వీధిలోని బంగారు షాపులపై గురువారం ఆకస్మికదాడులు నిర్వహించారు. భారీగా ట్యాక్సులు విధించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఏ ఏ షాపుల్లో తనిఖీతంతు నిర్వహించాలో ముందుగా ఒక జాబితాను తయారుచేసుకుని ఆ షాపుల్లోకే నేరుగా ఈ బృందాలు అడుగుపెట్టాయి. ఒక్కసారిగా జియస్‌టి పరిధిలోని షాపులన్నీ మూతపడ్డాయి. జియస్‌టి కస్టమ్స్ అధికారుల బృందాలు ఏ నిమిషంలో ఏ షాపులో తనిఖీ చేస్తారో అన్న భయాన్ని కావలికి కల్పించారు. కావలి విష్ణాలయం వీధిలోని ఒకే ఇంటిపేరుతో ఉన్న 5 బంగారు షాపుల్లో ఈ అధికారులు నఖశిఖపర్యంతం తనిఖీలు నిర్వహించారు. ఇదే వీధిలో మరో షాపులో తనిఖీ చేపట్టారు. మొత్తం 6 షాపుల్లో ఉదయం 11:30 గంటలనుంచి రాత్రిదాక సోదాలు జరిగాయి. సక్రమంగా, వ్యాపారానికి తగ్గట్టుగా ప్రభుత్వానికి జియస్‌టి చెల్లించలేదన్న ఫిర్యాదులను పురస్కరించుకుని ఈ అధికారుల బృందాలు కావలి విష్ణాలయం వీధిలోకి అడుగుపెట్టాయి. ఈ బంగారు షాపుల్లో ఉన్న రికార్డులకు మించి భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు, ట్యాక్స్ కట్టకుండా భారీగా వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న విషయం అధికారుల సోదాలో బయటపడింది. తరచుగా వస్తున్న ఫిర్యాదులను పురస్కరించుకుని ఈ అధికారులు ఈ షాపుల్లో దాడులు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పక్కా సమాచారంతో ఏ ఏ షాపు ఎక్కడుందో తెలుసుకుని నేరుగా ఆ షాపుల్లోనే ఈ అధికారులు అడుగుపెట్టి తనిఖీచేయడం కొసమెరుపు. ఈ దాడుల్లో సెంట్రల్ పరిధిలోని జియస్‌టి కస్టమ్స్ ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ కమీషనర్లు నాగరాజు, రవికుమార్, ఇన్స్‌పెక్టర్లు, సూపరిండెంట్‌లు యుగంధర్, సుశీల్, శ్రీనివాసులురెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు. జియస్‌టి కస్టమ్స్ అధికారుల పిడుగుకు కావలి వ్యాపారవర్గాలు ఒక్కసారిగా భయకంపితులయ్యాయి. ఈ 6 షాపుల్లో ప్రతి బంగారు ఆభరణాలన్నీ వివరాలతో ఎన్ని కేజీలు ఉన్నాయో రికార్డులు కూడా రికార్డు చేశారు. అలాగే వెండికూడా రికార్డు చేశారు.

**❖ అధికారులతో ఆడిటర్లు, ప్రముఖులు చర్చలు...** జియస్‌టి, కస్టమ్స్ అధికారులు ఒక్కసారిగా కావలి విష్ణాలయం వీధిలో దాడులకు పాల్పడడంతో జియస్‌టికి సంబంధించిన ఆడిటర్లు, బంగారు సంఘాల అద్యక్షులు, కుదవ, బంగారుసంఘం వ్యాపారనేతలు, అధికారులతో చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ జియస్‌టి గ్రీవెన్స్‌కమిటి బోర్డుమెంబర్, బిజెపినేత, ప్రముఖ వస్త్రవ్యాపారి అమరా వెంకటసుబ్బారావు, కావలి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అద్యక్షుడు మొగళ్లపల్లి రాజ, కుదవసంఘం మాజీ అద్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, కావలి జియస్‌టి ఆడిటర్ శ్రావణ్, నెల్లూరు బంగారు వ్యాపారస్తుల సంఘం నేతలు, అధికారులతో చర్చలు జరిపారు. ఈ 6 షాపులకు సంబంధించి ఏ మేరకు జియస్‌టి ట్యాక్స్ విధించారో అన్న వివరాలు అధికారులు చెప్పడానికి నిరాకరించారు. అంతేకాకుండా ట్యాక్స్‌పరిధిలోకి రాని బంగారు, వెండి వస్తువుల జాబితాను వెల్లడించేందుకు కూడా అధికారులు సుముఖం వ్యక్తం చేయలేదు. మీడియాను కూడా ఏ షాపులోకి అనుమతించలేదు. ఫోటోలు తీసేందుకు కూడా అధికారులు ఒప్పుకోలేదు.

# జిల్లాలో 24 వేల 289 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

❖ రైతుల ఖాతాలకు రూ.52.10 కోట్లు నగదు జమ
❖ జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 20, ప్రభాతవార్త** జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 24,289 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కొల్లాబతుల కార్తిక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం 3582 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 52.10 కోట్ల రూపాయలు రైతులకు చెల్లించినట్లు జేసి తెలిపారు. రైతులందరూ కూడా దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ధాన్యం డబ్బులు కూడా చాలా ఆలస్యంగా వస్తాయని, ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు రోజుల్లోనే డబ్బులు జమవుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు.

# రూప్‌కుమార్‌కి నాకు విబేదాలు లేవు

❖ నా రాజకీయ పయనం వేమిరెడ్డి దంపతులతోనే : యర్రంరెడ్డి



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త** నెల్లూరు డిప్యూటి యేయర్ రూప్‌కుమార్ యాదవ్‌కి తనకి ఎటువంటి విబేదాలు లేవని, నా రాజకీయ పయనం మాసోదరి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తోనే అని పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు గత నాలుగురోజుల క్రితం అమరావతిలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో రూప్‌కుమార్,నేను కూర్చుని మాట్లాడుతున్న సమయంలో రూప్ ఒక అనారిని మాట అన్నాడు.దానికి నేను స్పందించాను. మాఇద్దరి మద్య వాగ్వివాదం జరగగా వెంటనే రవీంద్రరెడ్డి రూప్‌కుమార్‌యాదవ్‌ని తీసుకొని వెళ్ళిపోయాడు అని ఆన్నారు.కొంతమంది తమ రాజకీయ లబ్దికోసం రూప్‌కి నాకు మద్య జరిగిన చిన్న విషయాన్ని కొండతంతలు గోరంతలు చేసి సోషల్ మీడియాలో పెట్టారని ఆయన విమర్శించారు. పార్టీలు.... నాయకులు ... అన్న తరువాత చిన్నచిన్న విషయాలు జరుగుతుంటాయి వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పది నెలల పరిపాలనలో అవినీతి ఎక్కడ జరగలేదని, ఎవ్వరైనా నిరూపించుకోవచ్చునని ఆయన సవాల్ విసిరారు . ఆమె బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఏది చేయ్యాలన్నా అన్నా! ఏలా చేద్దామని మాతో సంప్రదించే నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. కొంతమంది స్వార్ధపరులు కావాలని ఏదో ఒక దుమారం లేపాలని ఇటువంటివి అన్ని చేస్తున్నారని విమర్శించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లో తెలుగుదేశం విజయకేతనం ఎగుర వేస్తామని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఎంతో అనుభవం ఉన్న మీరు బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఉండగా ఇతర మండలాల నాయకులు ఇక్కడ ఎందుకు పెత్తనం చేస్తున్నారని విలేఖర్లు ప్రశ్నించగా..... నేను స్వంత ప్రాజక్టు పనులపైన బిజిగా ఉండగా కమలాకర్‌రెడ్డి చూస్తున్నారని ఆయనకూడా నాకు నన్ను సంప్రదించే చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కోవూరు నియోజకవర్గంలో దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తరువాత అసెంబ్లీలలో ప్రతి సారి సమస్యలు పైన ప్రశ్నించిన శాసనసభ్యురాలు మా ప్రశాంతమ్మ అని ఆయన ప్రశంసించారు. ఆమె అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి కాలేదు. లేని పోని ఆరోపణలు చేస్తున్నారని ప్రతిపక్షాలకు ఇది సరికాదని అయన హితవు పలికారు. ఈకార్యక్రమంలో మండలాద్యక్షులు మన్నెపల్లి శ్రీనివాసులు, సర్పంచ్ లఘంతోటి మస్తానయ్య,నీటి సంఘం అద్యక్షులు నెల్లూరు రమణారెడ్డి , రియాజ్, పెనుబల్లి శ్రీకాంత్‌రెడ్డి, ఇనగనూరు సుధాకర్‌రెడ్డి, గుండా శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎస్‌డి ఫయాజ్, సుజిత్, ఇసనాకుల శ్రీనివాసులురెడ్డి, రేబాలకు చెందిన పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.

## కొత్తపాళెం ఎస్టి అంగన్‌వాడి ఆయ మృతి



**జలదంకి, మార్చి20,(ప్రభాతవార్త):**జలదంకి మండలం కొత్తపాళెం ఎస్టి అంగన్‌వాడికేంద్ర ఆయ పొట్టూరి సుగుణమ్మ(50) గురువారం మృతిచెందింది.గత కొంతకాలంగా సుగుణమ్మ అనారోగ్యంతో బాధపడు తుంది.మృతురాలికి భర్త అంకయ్య, నలుగురు పిల్లలు వున్నారు. విధినిర్వహణలో ఎంతో నిబద్దత తో వ్యవహరించే సుగుణమ్మ మృతివార్త విని విజ మూరు ఐసిడిఎస్ సిడిపిఓ పద్మజాకుమారి హుటా హుటిన వెళ్ళి సుగుణమ్మ మృతదేహంవద్ద నివాళు లర్పిం చింది. కుటుంబసభ్యులను పరామర్శించింది. ఆమె మృతికిగల కారణాలను అడిగి తెలుసు కొని మట్టి ఖర్చులనిమిత్తం 15వేల రూపాయలను భర్త అంకయ్యకు అందజేశారు. అలాగే గ్రామ సర్పంచ్ వేరెడ్డి సుబ్బరత్నమ్మ,గ్రామ పెద్దలు,ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ అరుణ,బ్రాహ్మణక్రాక సెక్టార్ అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు నివాళులర్పించారు.

## రీ సర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి





**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని కోవూరు పంచాయతీ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. ఈ మేరకు గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కోవూరు పంచాయతీకి సంబంధించి మొత్తం విస్తీర్ణం 5509 ఎకరాలు కాగా.. అందులో ఇళ్లు 567 ఎకరాల్లో.. చెరువు 605 ఎకరాలు కాగా.. ఇప్పటికే సర్వే 4407 ఎకరాలు పూర్తి అయిందన్నారు. ఇంకా 936 ఎకరాలు మాత్రమే సర్వే చేయాల్సి ఉందని, మార్చి నెలాఖరులోగా ఈ సర్వే కార్యక్రమం పూర్తవుతుందన్నారు. సర్వే బృందం కూడా ఏ రోజు ఏ ప్రాంతానికి వెళ్లాలో రెండు రోజులు ముందే ఆ ప్రాంత రైతులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గురువారం సర్వే కార్యక్రమాన్ని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదనరావు పరిశీలించి సర్వే బృందానికి పలు సూచనలు చేశారు.

## పొదుపు మహిళల్లో మరింత అవగాహన పెంచాలి



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పొదుపు గ్రూపులకు వీఓఏలు ప్రత్యేక దృష్టి సారించి వారిలో మరింత అవగాహన పెంచేలా దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం కోవూరు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జీవీల పీఎం అజయ్ కింద ఎస్సీ గ్రూపులకు వివిధ పథకాలకు సంబంధించి రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆ రుణాలు పొందిన ఆయా ప్రాంతాల్లో వారు ఏ పథకానికి సంబంధించి రుణం తీసు కున్నారో దానికి సంబంధించిన బోర్డు ఏర్పాటు చేసేలా వీవోఏలు తగు చొరవ తీసుకోవాలన్నారు. మండ లంలో ఇంకా లోకోస్ యాప్ అసంపూర్తిగా ఉందని, దానిని వెంటనే పూర్తి చేసేలా దృష్టి పెట్టాలన్నారు. పొదుపు గ్రూపుల క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడమే కాకుండా బ్యాంకు తిరిగి రుణాలు చెల్లించేలా వీవోఏలు తగు చొరవ తీసుకోవాలన్నారు. పొదుపు గ్రూపు మహిళలు వారి వారి ఇళ్ల దగ్గర కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకునేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, రాము, చైతన్యబాబు, శోభ, తదితరులు ఉన్నారు.

## నూలు పంపిణీ చేసినందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృతజ్ఞతలు



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** అసెంబ్లీ సాక్షిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేనేతలకు సంబంధించి వారి స్థితిగతులు, సంక్షేమం కొరకు అనేక ప్రతిపాదనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. 200 యూనిట్ల విద్యుత్ నెలకు రాయితీ అమలులోకి వచ్చింది. కొత్తగా సహకార సొసైటీలు ఏర్పాటు చేసి 200 మంది చేనేత కార్మికులకు పని కల్పించేందుకు సంబంధిత శాఖ ప్రణాళికలు కూడ సిద్ధం చేసింది. ఈ మేరకు పాటూరుకు చెందిన పద్మజ, గుమ్మలదిబ్బకు చెందిన నాగలక్ష్మి అనే మహిళా చేనేత కార్మికులు 20 వేలు విలువ చేసే నూలు, ముడిసరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు జిల్లా చేనేత కార్యాలయంలో ఆఫీసిలో వారికి అందజేశారు. వీటితో తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మెరుగైన ఉపాధి కల్పించేలా దృష్టి సారిస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి చేనేతల అభివృద్ధి కోసం అన్ని స్థాయిల్లో కృషి చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు టీడీపీ నేతలు కేవీ శేషయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి. వరప్రసాద్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాధవి, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి. వరప్రసాద్, ఏ. వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## వైభవంగా అభిషేక పూజలు



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వ ర్యంలో అభిషేక పూజలు సాంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. చుట్టుపక్కల ప్రాం తాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థా పకురాలు పచ్చిపాల సుజాత, ఫౌండర్ ట్రస్టీ పచ్చిపాల గోపాల్‌రెడ్డి, తది తరులు ఉన్నారు.

## గేట్ పరీక్షలలో మెరిసిన ఉదయగిరి కుర్రాడు



**ఉదయగిరి, మార్చి 20, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని జి.చెర్లోపల్లి వడ్డేపాలెం గ్రామానికి చెందిన దేవుండ్ల శేఖర్ అనే విద్యార్థి ఆల్ ఇండియా లెవెల్‌లో గేట్ ఈసీఈ గ్రూపులో 425వ ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన శేఖర్ ఎలాంటి కోచింగ్ లేకుండానే గేట్ పరీక్ష రాశారు. ఉదయగిరి కుర్రాడికి మంచి ర్యాంకు సాధించడంతో ఈ ప్రాంత వాసులు కుటుంబ సభ్యులు గ్రామంలోని ప్రజలు అభినందనలు వెల్లువెత్తారు. ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర ఎక్కడ..?

**- దళారులుతో చేతులు కలిపిన సోమిరెడ్డి**

**- రైతులను దగా చేస్తున్నారంటూ కాకాని ఫైర్**



**నెల్లూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త :** గిట్టుబాటు ధర గురించి మొక్కుబడిగా చర్చించి. సమావేశం పేరిట సోమిరెడ్డి జీడిపప్పు, పిస్తాపప్పులు తినేసి, టీ తాగి వెళ్లిపోతున్నాడు. మంత్రిగా ఉన్న సమయంలో దళారులు, రైస్ మిల్లర్ల దగ్గర సోమిరెడ్డి ముడుపులు దండుకుని రైతులకు అన్యాయం చేశాడు. రైతులు ఇంకా ఆ విషయాన్ని మరిచిపోలేదు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. అల్లీపురంలో రైస్ మిల్లులు ఉండకూడదని సోమిరెడ్డి కలెక్టరేట్ లో సమావేశం పెట్టి, మిల్లర్ల దగ్గర పిండుకున్నాడు.. మరోసారి మిల్లర్స్ ని బ్లాక్ మెయిల్ చేసేందుకే సోమిరెడ్డి రివ్యూ మీటింగ్ అంటూ హడావిడి చేస్తున్నాడు. సాయంత్రానికి మిల్లర్లతో డీలింగ్ చేస్తూ బిజీగా ఉంటున్నాడు. సోమిరెడ్డి మిల్లర్లను బ్లాక్ మెయిల్ చేసి, డబ్బులు దండుకుంటూ, రైతులను నష్టపరిచే పద్ధతిని మానుకోవాలి. వరి కోతల సీజన్ వస్తే సోమిరెడ్డి పంట పండుతుంది తప్ప రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. క్వార్జ్ మైన్స్ దగ్గరకు జిల్లాకు చెందిన నాయకులను తీసుకెళ్లి క్వార్జ్ యాజమాన్యాలతో డీల్ కుదుర్చుకున్నాడు. 12 మంది నాయకులకు 12 వాటాలు ఇవ్వాలంటూ బెదిరించి, వసూల్ చేసి, ఎవ్వరికీ ఇవ్వకుండా సోమిరెడ్డే కొట్టేశాడు క్వార్జ్ విషయంలో మోసపోయిన ప్రజాప్రతినిదులందరూ ఈసారి సివిల్ సప్లయ్ మినిస్టర్ రివ్యూకి పోకుండా జాగ్రత్త పడ్డారు. సోమిరెడ్డి ఈ సారి కొత్త బ్యాచ్‌ను వెంటేసుకుని, మంత్రులను, కొత్త ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను హోల్ సేల్‌గా అమ్మేస్తున్నాడు. కొత్త ఎమ్మెల్యేలందరూ సోమిరెడ్డితో జాగ్రత్తగా ఉండాలి.. లేదంటే క్వార్జ్ విషయంలో జరిగినదే మళ్లీ జరుగుతుంది. సోమిరెడ్డి సమావేశం పెట్టినరోజే జిల్లాలో వెయ్యి రూపాయలు ధర తగ్గితే ఆయన ఏం చర్యలు తీసుకున్నారు..? సోమిరెడ్డి కాస్త సైలెంట్‌గా ఉంటేనే జిల్లా రైతులకు న్యాయం జరుగుతుంది. జిల్లాలోని మిల్లర్లకు సోమిరెడ్డి నాయకుడిగా మారి పెద్ద దళారిగా మారి రైతుల పొట్టకొడుతున్నాడు. ఇంటి చుట్టూ ఇరిగేషన్ కాలువలు పూడ్చేసి లేవుట్స్ వేసుకుంటేవాళ్ళ దగ్గర సోమిరెడ్డి ప్యాకేజ్ తీసుకుని సైలెంట్ అయ్యాడు. ఆ లేవుట్స్‌లో ఇళ్లు కట్టుకునేవారి దగ్గర దండుకునేందుకు మరోసారి ఇరిగేషన్ కాలువలు ఆక్రమణ అంటూ అసెంబ్లీలో మాట్లాడాడు. నిజంగా చిత్తుశుద్ధి ఉంటే నువ్వు నిజంగా మనిషివైతే నీ ఇంటి చుట్టూ చెరువులు, కాలువలు ఆక్రమించారు. దాని మీద విచారణ జరిపించే దమ్ము నీకు ఉందా అని ప్రశ్నించారు. స్వంత ఊర్లో కాలువలు ఆక్రమించి లేవుట్స్ వేస్తే వారి దగ్గరే డబ్బులు దండుకున్న నీచ చరిత్ర నీది. డబ్బులకు అమ్ముడుపోయిన వ్యక్తివి ప్రజాప్రతినిధులు సోమిరెడ్డి ట్రాప్‌లో పడొద్దు, వాళ్ళని కూడా సోమిరెడ్డి అమ్మేస్తాడు. సోమిరెడ్డి లాంటి వ్యక్తులు దేవాలయం లాంటి అసెంబ్లీకి వెళ్లి దాని ప్రతిష్టను నాశనం చేస్తున్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, అధికారులు బ్లాక్ మెయిలర్ సోమిరెడ్డిని లైట్ తీసుకొని, రైతులకు న్యాయం చేయడంతో పాటు, అల్లీపురం నుండే ఇరిగేషన్ కాలువల ప్రక్షాళన పనులు ప్రారంభించమని ఆయన విన్నవించారు.

## రెండో క్రాప్‌కు నీటిని విడుదల చేయాలంటూ నిరసన



**దగదర్తి, మార్చి 20, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన దగదర్తి గ్రామంలో ఇరిగేషన్ అధికారులు రైతుల ను గురువారం రోజు పది గంట లకు మండల రెవెన్యూ ఆఫీసు నందు సమా వేశం ఉందని తెలియజేశారు. రైతులం దరూ రావాల్సిందిగా కోరారు. అయితే ఇరిగేషన్ అధికారులు వస్తామని చెప్పి రాలేదు. ఇరిగేషన్ అధికారులు రాకపోవ డంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాక మండల రెవెన్యూ ఆఫీసు ముందు నిరసన వ్యక్తం చేశారు. రైతులు నీటి సంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నీటి సంగం నాయకులు మాలేపాటి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ సోమశిల డ్యాములు 65 టీఎంసీలు నీరు ఉన్నా రైతులకు రెండో క్రాప్ట్ లేకుండా చేయడంలో ఇరిగేషన్ అధికారుల ఉద్దేశం ఏమిటో కనీసం నీటి సంఘం నాయకులైన మాకు విషయం తెలియదు తెలియకుండా డియర్ ఛానల్ బ్రిడ్జి పడగొట్టడంపై వారి ఉద్దేశం ఏమిటో మాకు తెలియచెప్పాలని వచ్చి రైతులకు రెండో క్రాప్ట్ పంట ఉన్నదా లేదా చెప్పాలని రెండో క్రాప్ట్ లేకపోయినా పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు. రైతులు చెప్పాల్సిన బాధ్యత అధికారులకు ఉందని, రైతులకు సమాధానం చెప్పకపోతే మేము బస్తాలు కట్టి రెండో పంట పండించుకుంటామని ఇది రైతుల సమస్య కానీ రాజకీయానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి రవీంద్రనాయుడు ఉన్నారు. మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ రైతులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులకు ఉందని వారు వస్తామని రాలేదు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులని ఇబ్బందులు పెట్టొద్దని అధికారులు చెబుతున్న అధికారులు రాకపోవడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కావాలి ఎమ్మెల్యే దగ్గుమాటి కృష్ణారెడ్డి నది ఒకటే దారని తెలుగుదేశం పార్టీ అని, మధ్యలో ఎవరు సృష్టించవద్దని చెప్పారు. రైతులు మాకు న్యాయం చేయాలని చెబుతున్నారు. ఈ కార్యక్రమానికి నీటి సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన పాదర్తి చెంచుకృష్ణయ్య 12వ వర్ధంతి



**కావలి, మార్చి20 ప్రభాతవార్త :** కావలి పట్టణ ఒంగోలు బస్టాండ్ సమీపంలోని తిరుమల జనరల్‌స్టోర్స్ వద్ద పాదర్తి చెంచు కృష్ణయ్య 12వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పాదర్తి చెంచుకృష్ణయ్య కుమారులు పాదర్తి ప్రసా దరావు, నాగరాజు, సురేష్‌బాబు, ఉదయ్‌కుమార్‌లు పేదలకు అన్నదానం, మజ్జిగ పంపిణి కార్యక్రమాలను నిర్వహించారు. కావలి శివాలయం దగ్గర నూతనంగా నిర్మిస్తున్న శివశంకరతీర్థ అపరకర్మకాండల భవన నిర్మాణానికి పదివేల నూటపదహారు రూపాయలు, ఒక ట్రాక్టరు ఇటుక విరాళంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం కావలి మండల అధ్యక్షులు తటవర్తి రమేష్, ప్రధానకార్యదర్శి ఓరుగంటి రామకృష్ణ, మాజీ ఎఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, కిరాణామర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్సా ప్రసాద్, సెవెన్‌లైన్స్ సభ్యులు గాదంశెట్టి వేణు, సువర్ణ హోమ్‌నీడ్స్ శ్రీనివాసులు, మెట్టుగాని రమేష్, పెసల పవన్, కావలి చినజియర్‌స్వామి శ్రీనివాసాచారి, ఒరుగంటి రవి, ఒరుగంటి సురేష్, గాదంశెట్టి మధుసూధన్‌రావు, టంగుటూరి రవి, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. చెంచుకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

## చేనేతలకు ఉచితంగా 2 వందల యూనిట్లు కరెంటు ఇవ్వడం అభినందనీయం



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త :** నారా లోకేష్ పాదయాత్రలో ప్రకటించిన విధంగా చేనేతలకు ఉచితంగా 2 వందల యూనిట్లు కరెంటు ఇవ్వడం అభినందనీయమని చేనేత రాష్ట్ర డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపా రు. అసెంబ్లీలో చేనేత కారఇ్మకులకోసం గళం విప్పిన కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఎప్పుడు రుణపడి ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఇ మనోహర్‌కి ఉచిత విద్యుత్ కోసం 50 అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దోనిపర్తి వెంకటరమణ, గుంటూరు ప్రసాద్, చల్లా సురేష్, చింతం హరికృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో జనసేన క్రమశిక్షణాసంఘం ఛైర్మన్ వేములపాటి జన్మదిన వేడుకలు



**కావలి, మార్చి20 ప్రభాతవార్త :** జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి, క్రమశిక్షణాసంఘం ఛైర్మన్, ఎపి టిట్కో ఛైర్మన్, నెల్లూరుజిల్లా పర్యవేక్షకుడు వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను గురువారం కావలిలో జనసేన సీనియర్‌నేత ఎంవి సిద్ధు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కావలి పట్టణంలోని బుడమగుంట ఎస్టీకాలనీల్లో 300ల మంది నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు సిద్ధు పంపిణి చేశారు. వేములపాటి అజయ్‌కుమార్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన కావలి రూరల్ మండల అధ్యక్షులు తుళ్లూరు తిరుపతిస్వామి, చేవూరు నాయబ్, సాయి, మల్లికార్జున యాదవ్, మెడికల్ సురేష్, మహ్మద్, హరీష్, విష్ణు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మా వేతనాలు విప్పించండి సారూ మహిళా కార్మికుల వినతి



**మనుబోలు మార్చి 10 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని చెర్లోపల్లి మరియు కుడితిపల్లి గ్రామానికి చెందిన దళిత మహిళలు కార్మిక కమీషనర్‌కి వినత పత్రం అందజేశారు. పనిచేయి ంచుకొని వేతనాలు ఇవ్వలేదని వారు వాపోయా రు. అక్కం పేట గ్రామంలోని ఎస్ఆర్‌పికిల్ ప్యాక్టరీలో గత సంవత్సరంగా పని చేశామని గత డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు పనిచేసిన 3 నెలల కాలానికి వేతనాలు ఇమ్మంటే ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముందే మాకుటుంబాలు పరిస్థితులు బాగు లేవని పిల్లల పీజులు కూడా కట్టలేకపోతున్నామని కుటుంబ పోషణ జరగక ఇబ్బందులు పడుతున్నామని అర్జీ ద్వారా వారు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోగుల శ్రీనివాసులు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తలారి దేవదానం మరియు కార్మిక మహిళలు పాల్గొన్నారు,

## దగదర్తి తూనికల కొలతల అధికారులు దాడులు

**దగదర్తి, మార్చి 20, ప్రభాతవార్త :** దగదర్తిలో తూనికల కొలతల అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్య అధికారి ఒకరు దగదర్తిలో అంగళ్ళలోని కాటాలను తనిఖీ చేసి అవకతవకలు ఉన్నట్లు గుర్తించి పెనాల్టీలు వేసి అనధికారికంగా ప్రజల ముందే లంచాలు తీసుకుంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని రచ్చబం డల దగ్గర ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

## మాజీ ఎమ్మెల్యే బొల్లినేనికి వెలిగొండ జలాల సాధన సమితి ఆహ్వానం



**ఉదయగిరి, మార్చి 20, ప్రభాతవార్త :** ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావును బుధవారం వెలిగొ ండ జాలాల ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు బొల్లినేని కలిసి ఉదయగిరి పట్ట ణంలోని షాది మంజిల్ వద్ద ఆదివారం 23-03 -2025 తేదీన జరిగే వెలిగొండ ప్రాజెక్టు సాధన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా బొల్లినేని వెలిగొండ ప్రాజెక్టు సాధన సమితి సభ్యులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఉదయగిరి దుత్తలూరు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, వెలిగొండ జలాల సాదన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## తమ్మిరెడ్డిని పరామర్శించిన వైసిపి అధికారి ప్రతినిధి ప్రసన్న



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చెల్లాయపాళెం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు తమ్మిరెడ్డి రత్నం కుమా రుడు తమ్మిరెడ్డి ఈశ్వరయ్య ఇటీవల రోడ్డు ప్రమా దానికి గురై చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసు కుంటుండంతో విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర అధికారప్రతినిది నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, వైసిపి నాయకులు కనిసిరి వెంకయ్య, బుచ్చి మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షులు కోవూరు రాఘవ స్ధానిక నాయకులు పాల్గొన్నారు.

## వైసిపి యువజన విభాగం అధ్యక్షులుగా కోవూరు రాఘవ



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం వైసిపి యువజన విభాగం అధ్యక్షు లుగా కోవూరు రాఘవ నియమితు లయ్యారు. ఈ సందర్భంగా వైసిపి అధికారి ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కలిసి పూల మొక్కను అందజేసి ప్రత్యేకంగా ధన్యవా దాలు తెలిపారు. తనపై అపార నమ్మకంతో ఈ బాద్యతలు అప్పగించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాఘవ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, వైసిపి నాయకులు కలువ బాలశంకర్‌రెడ్డి, కొడవలూరు మండల పార్టీ అధ్యక్షులు చిమ్మట శేషగిరి, దేవిరెడ్డి సాయిరెడ్డి, పాల్గొన్నారు.

## ఆర్.పి.ఐ.పార్టీ లో రాష్ట్ర అధ్యక్షులు ఇచ్చిన అపాయింట్ లెటర్ లే చెల్లుతాయి



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 20 ప్రభాతవార్త:** ఆర్ పి ఐ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అపాయింట్ చేసిన లెటర్ లే చెల్లుతాయని ఇతరులు ఇచ్చిన ఎటువంటి లెటర్లు చెల్లవని గురువారం స్థానిక గాంధీ బొమ్మ ఆర్.పి.ఐ జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోవూరు సురేష్ పత్రికల సమావేశం పెట్టి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ పి ఐ పార్టీలో కొంతమంది అనేక గొడవలు సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. నేను చాలా సీనియర్ రాజకీయ నాయకుడని , నాకు చాలా అనుభవం ఉందని ,రాజకీయ పార్టీల్లో అధ్యక్షులు నియమించిన వారే కొనసాగాలని ఇతరులు ఇచ్చిన లెటర్లు చల్లవని ఆర్. పి.ఐ పార్టీ బైలా చెబుతుందని స్పష్టంగా వివరించారు. అలా ఎవరైనా కొనసాగితే వారిపై క్రిమినల్ కేసులు అవుతాయని , చట్టపరంగాచర్యలకు బాద్యులగుతారనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు ముసలి జయరాజ్ బత్తుల మధుసూదన్ డక్కా చిరంజీవి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రటిడ్కో చైర్మన్ వేములపాటి జన్మదినోత్సవం సందర్బంగా సేవా కార్యక్రమాలు



**నెల్లూరు, మార్చి20 ప్రభాతవార్త- వైద్యం :** జనసేన పార్టీజాతీయ మీడియా ప్రతినిధి, జిల్లా పార్టీ ఇన్‌చార్జ్, రాష్ట్ర టిడ్కోచైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మది నోత్సవాని పురస్కరించుకుని గురువారం ఆ పార్టీ జిల్లా కోర్‌కమిటి సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని స్ధానిక ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో బాధితులకు పండ్లు, బ్రెడ్స్, బోజనం, మంచినీరు పంపిణీచేశారు. అనంతరం స్ధానిక ప్రగతి చారిటబుల్ ట్రస్టులో విద్యార్ధులకు, చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరంవారి మద్యనే బారీ కేక్‌ను కట్‌చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్బంగా నూనెమల్లిఖార్జునయాదవ్‌మాట్లాడుతు మోగా కుటుంబం కోసం నిస్వార్ధ సేవకునిగా వేములపాటి చేసిన సేవలు అభినందనీయమన్నారు. చిన్నతనం నుండే నాయకత్వ లక్షనాలు పునికి పుచ్చుకున్నారన్నారి, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే విద్యార్ధి సంఘ నాయకునిగా అనేక పోరాటాలు సాగించారని గుర్తుచేవారు. కోణిదల నాగబాబు ఉత్తమ మిత్రునిగా ఉంటూ ప్రజారాజ్యంలో కీలక భూమిక పోషించారని, అలాగే జనసేన పార్టీ, చిరు అభిమానులకు వారధిగా ఉంటూ అందరిని ఏకం చేశారన్నారు. పేదల పక్షపాతిగా ఎక్కడ అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగే వరకు వేములపాటి పోరాడేవారన్నారు. గత ఎన్నికల్లో ఆయన చేసిన కృషి గర్వకారణమన్నారు. ఇటవుంటి నేత జనసేన లోఉండటం అందరి అదృష్టమని కోనియాడారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులుపొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, సుదామాదవ్, గుడి హరిరెడ్డి , మురళీరెడ్డి, కృష్ణారెడ్డి, వర్షా,చలం, రాజేష్, నందిని, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

## 500 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



**దగదర్తి, మార్చి 20, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన సున్నబట్టి హైవేపై సుమారు 500 బస్తాల రేషన్ బియ్యం తీసుకుపోతున్న లారీని సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లై అధికారులకు వచ్చిన సమాచారం మేరకు సున్నంబట్టి దగ్గర కాపు కాచి రహదారి వైపు వెళ్తున్న లారీని పట్టుకున్నారు. పట్టుకున్న వెంటనే తహశీల్దార్ కృష్ణకు సమాచారం ఇచ్చి దగదర్తి పోలీసు స్టేషన్‌కి అప్పగించారు. ఈ రేషన్ బియ్యం గుడ్లూరు మండలం పెద్దపల్లి గ్రామం నుంచి చెన్నైకి తరలిస్తున్నట్లు చెప్పారు. సుమారు 520 బస్తాల దాకా ఉంటాయని సివిల్ సప్లై అదికారులు తెలియజేశారు.

## వినాయకకాలనీ నిరుపేదలకు అన్నదానం



**కావలిరూరల్, మార్చి20 ప్రభాతవార్త** కావలి పట్టణ నివాసులు స్వర్గీయ గణేశం పుల్లమ్మ మూడవ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు గణేశం అజయ్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డి, మనుమళ్ల ఆశీష్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, మనుమరాళ్లుఅర్చనారెడ్డి, అక్షయారెడ్డి, అనన్యారెడ్డిల సహకారంతో సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణ పరిసర ప్రాంతమైన ముసునూరు వినాయకకాలనీ పేదలకు అన్నదానంచేయడంజరిగింది. దాతలు గణేశం అజయ్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డిలు మాట్లాడారు. తన తల్లి దండ్రుల జ్ఞాపకార్థంగా గత మూడు సంవత్సరాలుగా సంయుక్తసేవాసంస్థ ద్వారా పేదలకు సేవచేస్తున్నామని తెలియ చేశారు. దీనిలో భాగంగా మా తల్లి స్వర్గీయ గణేశం పుల్లమ్మ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు. ప్రతిసంవత్సరం మా తల్లి జ్ఞాపకార్థంగా పేదలకు సేవలను కొనసాగిస్తామని తెలియచేశారు. సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. తమ యొక్క సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేసిన దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ చేస్తు న్నామన్నారు. గణేశం పుల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో దాతల కుటుంబ సభ్యులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోండి.. రాజకీయ రంగులు పూయొద్దు..



**ముత్తుకూరు, మార్చి 20, ప్రభాతవార్త** రైతులు రాత్రి పగళ్ళు అహర్నిశలు కష్టపడి పండించిన దాన్యానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకన్నా ఎక్కువ ధరను రైతులు పండించిన ధాన్యానికి కల్పించాలని దీనికి రాజ కీయ రంగులు పూయొద్దని రైతులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కోమల శీనయ్యలు అన్నారు. గురువారం దమ్మయపాల్యెంలోని సన్నారెడ్డి దయాకర్ రెడ్డి నివాసంలో వైసిపి నాయకులు రైతులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దమ్మయపాల్యెంలో రైతులు పడుతున్న కష్టాన్ని తెలుసుకునేందుకు స్థానిక రైతులతో కలిసి ధాన్యాన్ని పరిశీలించారని, వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టిబాటు ధర కన్నా ఎక్కువ ఆధాయానికి 23 వేల రూపాయిలు అమ్మారని, ఈ కూటమి ప్రభుత్వంలో గిట్టుబాటు ధరకు కాకుండా తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముతున్నామని వాపోయారు. ఎకరాకి రైతుకి 20 వేల నష్టం వాటిల్లుతుందని, కౌలు రైతులకు పరిస్థితి అఘోమ్యచరంగా తయారైయిందన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్థానిక నాయకులు చొప్పుడు మాటలు విని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పైన బురద చల్లె ప్రయత్నం చేస్తున్నారన్నారు. గతంలో దమ్మయపాలెంలోటిడిపి కంచుకోటగా ఉన్నదని స్థానిక నాయకులు వల్లటిడిపి కనుమరుగౌపోయింది అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వారుకోరారు. దువ్వూరురామనాధరెడ్డి, మూగ చిన్నా, మన్నేపల్లిశేషయ్య, సుబ్బరామిరెడ్డి, వెడిచర్ల మల్లికార్జున, దువ్వూరు సుబ్రమణ్యం రెడ్డి, ఒనుకూరు భాస్కర్, పంట్రంగి మురళికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టిడ్కో చైర్మెన్ జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు, మార్చి20, ప్రభాతవార్త:** నెల్లూరుజిల్లా జనసేనపార్టీ హెడ్, ఎపి టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఆత్మకూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు నియోజకవర్గ సీనియర్‌నాయకులు చదలవాడ హరీష్‌కుమార్ సహ కారంతో జనసేన పార్టీ మండల ఇన్‌చార్జ్ లు, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో స్థానిక 100పడకల జిల్లా ఆసుపత్రిలో 100మందికి పైగా గర్భిణీలకు, రోగులకు బ్రెడ్స్, ఫ్రూట్స్, జ్యూస్‌లు అందజేశారు. ఏఎస్‌పేట జనసేనపార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌బాషా, ఆత్మకూరు నియోజకవర్గ చిరంజీవి, యువత అధ్యక్షులు, జనసేనపార్టీ సంగంమం డల సీనియర్ నాయకులు దాడి భానుకిరణ్, జనసేనపార్టీ పట్టణ నాయకులు గడ్డం వంశీ , ఆత్మకూరు రూరల్ నాయకులు శ్రీరామ్, పవన్, భానుచంద్ర, వినయ్, చంద్రారెడ్డి, వెంకటేష్, నజీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**మర్రిపాడు, మార్చి20, ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం రాజుపాళెం అటవీ ప్రాంతం సమీపంలో గురువారం చెట్టుకు ఉరేసుకొని ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులుతెలిపారు. రాజుపాళెంకు చెందిన నారు బక్కిరెడ్డి(70) మనస్థాపానికి గురై చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారంతో స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాలు పరిశీలన



**బిట్రగుంట మార్చి 20 ప్రభాతవార్త** అంగన్వాడి దినోత్సవ సందర్భంగా ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా చీఫ్ దాసరి సునీల్ వారి బృందముచే మండలంలోని రామస్వామి పాలెం లోని అంగన్వాడి కేంద్రాలను గురువారం పరిశీలన చేసారు. అంగన్వాడి కేంద్రంలో భోజనం ఏవిధంగా ఉంటుంది? పిల్లలపట్ల భద్రత విషయాల ఏ విధంగా ఉన్నాయి? భోజనం ఏవిధంగా వండుతున్నారు? అక్కడ పిల్లలతోనూ పిల్లల తల్లిదండ్రులతోనూ టీచర్ సహాయకురాలితో మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసి యేషన్ జిల్లా చీఫ్ దాసరి సునీల్, జాయింట్ సెక్రెటరీ బత్తుల రవిచంద్ర, సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



**వరికుంటపాడు, మార్చి 20, ప్రభాత వార్త** త్రిమత ఏకైక గురువు, ఆధ్యాత్మిక సామ్రాజ్య చక్రవర్తి, శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి దుత్తలూరు కమిటీ ఆధ్వర్యంలో గురువారం త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్‌లను వరికుంటపాడు కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్‌లను బ్యాంకు సిబ్బందికి పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికి సరళమైన భాషలో అర్థం అయ్యే విధానం గా రూపొందించడం జరిగిందని వారు అన్నారు. ఈ కాలసూచికలో ఇంకా చాలా విశేషాల్లో భాగంగా దేవాలయం సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకముల సారముతో పాటు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉన్న భగవద్గీత యొక్క సారాంశం ఇందులో పొందుపరిచి స్వామివారు రచించడం జరిగిందన్నారు. తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగ తిధులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి తయారు చేసిన ఇటువంటి గొప్ప కాలసూచికను అందించడం ప్రజలందరూ హర్షించదగ్గ విషయం అన్నారు. త్రైత సిద్ధాంత - ప్రబోధ సేవా సమితి దుత్తలూరు అధ్యక్షులు సభ్యులు జి.ప్రసాద్, జి.సుధాకర్, జి.పెంచలరత్నం, కే.నరసింహులు, బి.మాలకొండారెడ్డి, వై.మహేంద్రా, వి.కొండలరావు, డి.రమణారెడ్డి, ఎం.కొండారెడ్డి, టి.మాలకొండారెడ్డి, సీహెచ్ మధుసూదన్‌రావులు పాల్గొన్నారు.

## విద్యార్థినీలకు స్వీయ రక్షణపై అవగాహన



**వరికుంటపాడు, మార్చి 20, ప్రభాతవార్త** ప్రతి విద్యార్థిని తప్పక స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం.రఘునాథ్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థినీలకు ఆపద సమయంలో ఎలా ఉండాలి అంటూ స్వీయ రక్షణ పద్ధతులను వివరించారు. నేటి సమాజంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, వేదింపులు ఎక్కువగా జరుగుతున్నాయని కాబట్టి ప్రతి మహిళ, చిన్నారులు స్వీయరక్షణ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.మాలకొండయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఐక్యతగా అడుగు వేద్దాం.. వెలుగొండ ప్రాజెక్టును సాధిద్దాం



**వింజమూరు, మార్చి 20, ప్రభాతవార్త** మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం, ప్రకాశం కడప నెల్లూరు జిల్లాలోని వలస ప్రాంతాల అభివృద్ధి కోసం ఐక్యతగా అడుగు వేద్దాం.. వెలుగొండ ప్రాజెక్టు సాధించుకుందాం వెలిగొండ జలాల సాధన సమితి అధ్యక్షులు నారాయణరెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం వింజమూరులోని స్థానిక ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వెలుగొండ జలాల ప్రాజెక్టు సాధన సమితి పేరుతో ఈనెల 23వ తేదీన ఆదివారం ఉద యగిరిలో జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున నెల్లూరు, ప్రకాశం, కడప ప్రాంతాలలోని ప్రజానీకం పెద్ద ఎత్తున హాజరు కావాల న్నారు. అనేక దశాబ్దాల కాలం సాగునీరు తాగునీరు లేకపో వడంతో వలసలు పెద్ద ఎత్తున పోయారని నిష్టదరిద్రంలో కొట్టు మిట్టాడుతూ వలసలతో అనారోగ్యంతో జనసాంద్రత తగ్గిపోయి గ్రామాలు ఒక వైపు అభివృద్ధి అయిన ప్రాంతాల నుంచి ఒక ఎకరా అమ్ముకొని ఈ ప్రాంతంలో 100 ఎకరాలు కొని ఈ భూ ఖండాలకు యజమానులై మన ప్రాంతానికి మనమే కూలీలుగా, మన ప్రాంతంలో ఉన్న సాగు యోగ్యమైన లక్షలాది ఎకరాల భూములను ఇతరులకు అప్పచెప్పి మనం మళ్లీ మాతృభూమి వైపు తిరిగి చూడకుండా సుధీర తీరాలకు జీవన ప్రయాణం సాగి స్తున్నామన్నారు. మన ప్రాంత ప్రజలకి ఈ సమస్య గురించి అం దరికి తెలిసింది. అయినా పరిష్కారం కొరకు ఏదైనా సంద ర్భంలో ఉన్న ఈ విషయం చర్చిస్తే మనకెందుకులే అని ధోరణి ఈ ప్రాంతానికి పెట్టిన భావ దారిద్ర్యం వలన ఈ స్థితి దాపరి చిందన్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ వారైనా ఏ సామాజిక వర్గమైన ఈ దోరణి వల్ల ఈ ప్రాంతంలో ప్రజలు అన్యాయానికి బలై పోతున్నారు. వారి ఆలోచనలు ఈ ప్రాంతం పట్ల ప్రభుత్వాల్లో కూడా ఎటువంటి మార్పు లేదు. ఇప్పటికి కూడా లక్షలాది ఎక రాలు సాగు ఒక అవకాశం ఉండి. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాక పొలాలు బీళ్లుగా మారుతున్నాయని, ఇంకా కొన్ని సంవత్సరాల్లో మీ ప్రాజెక్టు పూర్తికానట్లయితే ఈ వేసవి కాలంలోనే చెట్లు ఎండి పోతాయని, ఆ తర్వాత మనుసులు ఏమైపోతారో తెలియని పరిస్థితిలో మన ప్రాంతంలో ఉందన్నారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల ప్రస్తావన లేకుండా ప్రజల అవసర మని జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసి అన్న శ్రీరాముని వచనం చూస్తే పుట్టిన గ్రామం స్వర్గము లాంటిది గ్రామాన్ని వది లేస్తే మరో జన్మ ఎత్తినట్లే అని మన పూర్వీకులు ప్రవచించారు. కావున తమరు ఆలోచించి విజ్ఞులైన మీరు ఈ సమావేశానికి విచ్చేసి సమావేశంలో మీ ఆలోచనలు తెలియజేయాలన్నారు. డాక్టర్ కే.మాశిలమని మాట్లాడుతూ వెలుగొండ సాధన ఆవశ్యకతను దానివల్ల ప్రయోజనాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వాసుల సేవ కోసమే ఉన్నానని, వారి సంక్షేమం కళ్ళారా చూడాలన్నదే మా లక్ష్యం అని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు సాధన జరిగినట్లయితే ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమై విరాజిల్లుతోందని అంచేత పార్టీలకు అతీతంగా అందరూ సమిష్టిగా కృషిచేసిసాధిం చుకోవాల్సి న అవసరం ఉందన్నారు. దేగ మధు యాదవ్, మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, మట్టే హరి నారాయణ, మల్లిఖార్జున, మెంటా రమేష్, పొన్నూరు ప్రకాశం తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయము - పిడతాపోలూరు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్.ఓ.సి.నెం.06/2025 తేది: 20.03.2025

### టెండర్ ప్రకటన

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలము పిడతాపోలూరు గ్రామ పంచాయతీ ఏరియాలో 2025-2026 సంవత్సరమునకు గాను తే: 01-04-2025 ది నుండి తే: 31-03-2026 ది వరకు గ్రామ పంచాయతీ నందు వివిధ సేవలు నిర్వహించుటకు దండోరా మూలముగా టెండర్ దాఖలు చేయవలెనని తేది : 21-03-2023 దిన తెలియపరచడమైనది. సదరు సేవల మీద సిబ్బందిని పంపుటకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టుకు గ్రామపంచాయతి నందు టెండర్ దాఖలు చేయవలెను సదరు టెండర్ దాఖలు తేది: 29-03-2025 ఉదయం 10.00 గం నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. మరియు అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు హాజరైన టెండర్ దారుల సమక్షం నందు సీల్డు టెండర్లు తెరువబడును. ధాఖలు చేయువారు ఈ క్రింది తెలిపిన విధముగా నిర్ణీత ధరావత్తు పంచాయతీ కార్యాలయములో చెల్లించి తగు రశీదు పొంది, టెండరును జతపరచి టెండరు దాఖలు చేయవలెను. మిగిలిన నిబంధనలు మరియు వివరములు కార్యాలయ పని వేళలందు వచ్చి తెలుకోనవచ్చును. గ్రామ పంచాయతీ కి సిబ్బందిని ప్రతిరోజు పంపవలెను. షరతులు వర్తించును పై టెండర్లు ఆమోదం తెలుపుటకు తుది నిర్ణయం పంచాయతీ వారిది. టెండరు తేదిన ప్రభుత్వం వారు సెలవుగా ప్రకటించిన యెడల మరుసటి రోజు కార్యాలయం పని వేళలో స్వీకరించబడును.

| వ.నెం. | టెండర్ వివరములు తే 01.04.2025ది నుండి తే 31.03.2026ది వరకు | టెండరు ధరావత్తు రూ. |
|---|---|---|
| 1 | 2025-2026 సం॥కు వీధి విద్యుత్ దీపములు, విడిభాగములు దఫాల వారిగా సరఫరా చేయుటకు | 500 |
| 2 | 2025-2026 సం॥కు PWS స్కీము విడి భాగములు దఫాల వారిగా సరఫరా చేయుటకు | 500 |
| 3 | 2025-2026 సం॥కు గ్రామ పంచాయతీకిట అవసరమగు స్టేషనరీ దఫాల వారిగా సరఫరా చేయుటకు | 500 |
| 4 | 2025-2026 సం॥కు ప్రజారోగ్యము మరియు పారిశుధ్య వస్తువులు, సామగ్రి మరియు పనిముట్లు సరఫరా చేయుటకు | 500 |
| 5 | 2025-2026 సం॥కు గ్రామ పంచాయతీ యందు ఈ దిగువ సూచించిన సేవలు అందించుటకు కాంట్రాక్టు లేబరును సరఫరా చేయుట కొరకు<br>1) PWS స్కీం పంపు ఆపరేటర్లు - 6<br>2) వీధి విద్యుత్ దీపములు వేయుటకు ఎలక్ట్రిషన్-1<br>3) ట్రాక్టరు డ్రైవరు -1 | 1500 |

**టి.శేషగిరి,** పంచాయతీ కార్యదర్శి, పిడతాపోలూరు గ్రామ పంచాయితీ, ముత్తుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

## శ్రీదత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు



**ఉదయగిరి, మార్చి 20, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం జలాశయం ఆవరణంలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయానికి చేరుకొని స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకుదర్శనమిచ్చారు. భక్తులు నైవే ద్యాలు సమర్పించి మొక్కులు సమర్పించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలుస్వీకరించి దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు.

## పేద విద్యార్థులకు ఆలయాల వంటివి గురుకుల విద్యాలయాలు



**ఉదయగిరి, మార్చి 20, ప్రభాతవార్త** ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-1 ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష నందు సీట్లు సాధించిన పేద విద్యార్థులకు ఆలయాల వంటివి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలు అని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల నందు విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్య, మంచి పౌష్టిక విలువలతో కూడిన భోజనం, ఉచిత వసతి, సంరక్షణ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన తదితర మంచి సదుపాయాలు కల్పించబడతాయని 2025-26 విద్యా సంవత్సరంకు సంబంధించి 5వ తరగతి అన్ని సీట్లకు, 6,7,8 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు, ప్రవేశ పరీక్ష 25 తేదీన అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ఎస్ గండిపాలెం ప్రిన్సిపాల్ పుష్పరాజ్ పాల్గొన్నారు.

## సీఆర్ఎంటీలతో సమావేశం : ఎంఈఓ



**ఉదయగిరి, మార్చి 20, ప్రభాతవార్త** ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-1 షేక్ మస్తాన్ వలి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నందు సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అ ధికారి మాట్లాడుతూ డ్రాప్ అవుట్స్ రీ జాయినింగ్ ప్రాసెస్‌ను తమ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని ఎస్ఏపీ4 పరీక్షలకు సంబంధించిన మార్కులను త్వరితగతిన ఆన్‌లైన్ నందు నమోదు చేసే విధంగా ప్రధానోపాధ్యాయులకు తెలియజేస్తూ ఉండాలని, ఆధార్ కార్డుల్లేని విద్యార్థుల సమాచారం, అపార్ ఐడీ వివరాలు ప్రతి సీఆర్ఎంటీ వద్ద సమాచారం ఉండాలని, డిప్యూటేషన్‌లపై పాఠశాలకు వెళ్లినప్పుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, ఆన్‌లైన్ యాక్టివిటీస్ ఎప్పటికప్పుడు పూర్తి చేసే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందిస్తూ ఉండాలని తెలియజేశారు.

## రూ.5లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



**వింజమూరు, మార్చి 20, ప్రభాతవార్త** వింజమూరు పంచాయతీ పరిధిలో గంగమెట్ట ప్రాంతంలో మా లచ్చమ్మ చెట్టు వద్ద నుండి సుమారు 200 మీటర్లు సీసీ రోడ్ల నిర్మాణం పనులను చేపట్టారు. ఆ ప్రాంతంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం, కళాశాల బాలుర వసతి గృహం, నివాసాలు ఉన్నప్పటికి సరియైన రహదారి లేక ఆ ప్రాంత వాసులు ఎన్నో రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ నిధులతో ఆ ప్రాంతంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి చేశారు. డీఈ సీహెచ్ మణికు మార్, పీఆర్ ఏఈ తిరుమలయ్య, నాయకులు చేబ్రోలు వసంతరావు, గోసు మహేష్, భోజనపు ఆనంద్ తదితరులు ఉన్నారు.

## ఏప్రిల్ 11లోపు ధరఖాస్తుచేయండి



**వలేటివారిపాలెం మార్చి 20, ప్రభాతవార్త** వలేటివారిపాలెం మండలం పోలినేని పాలెం సమీపంలోని కస్తూరిబా విద్యాలయంలో 6వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరెందుకు ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్‌లో ధరఖాస్తుచేయాలని ప్రిన్సిపల్ జి.గోవర్ధని తెలిపారు. ఆసక్తి, అర్హతగల బాలికలు మాత్రమే 'ఏపీకేజీబీవీ.ఏపీసిఎఫ్ఎస్ఎస్.ఇన్' అను వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. సదరు ధరఖాస్తు హార్డు కాపీతోపాటు సంబంధిత ధృవపత్రాలను జతపరచి కేజీబీవి నందు అందచేయాలని ఆమె సూచించారు. 6వ తరగతిలో 40,7వ తరగతిలో 2,8వ తరగతిలో 2, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలమేరకు అర్హులను ఎంపికచేయనున్నారు. అర్హులంతా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని గోవర్ధని విజ్ఞప్తిచేశారు. పూర్తివివ రాలకు కస్తూరిబా విద్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

## పీఆర్ఎన్ బాలికోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు అంచనాలు



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలలో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో దానికి సం బంధించి అంచనాలు తయారు చేసి పనులు చేపట్టేందుకు జిల్లా పరిషత్ ఉన్నతాదికారులు ఆదేశాలు ఇవ్వా లని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కోవూరు పంచాయతీరాజ్ స్పెషల్ ఏఈ నందకిషోర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గురువారం పాఠశాలకు వచ్చి ఏయే అభివృద్ధి పనులు ట్రస్టు చేపడుతుందో దానికి సంబంధించి అంచనాలు తయారు చేసేలా చర్యలు తీసుకు న్నారు. ఉపాధ్యాయులు గీతామాధురి, పిజికల్ డైరెక్టర్ దేవిక, తదితరులు ఉన్నారు.

## జనసైనికులకు అండగా విద్యార్థులకు ఫీజుల చెల్లింపు



**నెల్లూరు, మార్చి20 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ జిల్లా ప్రదాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన జనసైనికుడు చెరుకూరు సుబ్బ పిల్లలకు స్కూల్ ఫీజు రూ.20వేలు చెల్లించారు. ఈసందర్భంగా గునుకుల కిషోర్ మాట్లాడుతు ఇటీవల తమ పార్టీ క్రియాశీలక సభ్యులు చెరుకూరు సుబ్బు అకాలమరణం పాలయ్యారా న్నరు .వారి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుందని తమ దృష్టికి వచ్చిందని, తమ జిల్లా ఇన్‌చార్జ్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా ఆ పిల్లల స్కూలు ఫీజులు తమ సొంత నిధుల నుండి చెల్లించటం సంతోషంగా ఉందన్నారు. అభిమానులను, జనసేన నాయకులను , ఒకే తాటి పైకి తీసుకువచ్చి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు వేలముపాటిచేసిన కృషి మరువలేనిదన్నారు. తమకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఎల్లప్పుడు అందుబాటులో ఉండి తమను వెన్నంటి నడిపించిన వేములపాటి ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం కానుందని, ఆయన ఇటువంటి పుట్టిన రోజు వేడుకలను మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రశాంత్, విద్యార్థుల కుటంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



**నెల్లూరు, మార్చి21 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు గుర్రంకిషోర్ బాబు, శేఖర్‌ల ఆధ్వర్యంలో పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జనసేన పార్టీజిల్లా కార్యాలయ ఇన్‌చార్జ జమీర్ పాల్గొని పేదలకు అల్పాహారం, ఉపాహార ప్యాకెట్స్, మంచినీటి బాటిళ్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా జమీర్ మాట్లాడుతు తమ మిత్రులు మేములపాటి జన్మదినోత్సవం సందర్భంగా పేదలకు అన్నదానం చేయటం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకులకు, చిరు అభిమా నులకు వారధిగా వేములపాటి చేసిన సేవలు మరువలేనివని , ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు సం తోషంగా జరుపుకోవాలని కోరారు. కోవూరు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ గుడి హరిరెడ్డి, సుదీర్, వంశీ, అంట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, మార్చి 20, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు రైలు ఢీకొన్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. మృతుడికి సుమారు 45 ఏళ్ళ వయసు ఉంటుందని, ఆకు పచ్చ ఆఫ్ హ్యాండ్ టీ షర్ట్, బ్లూ రంగు షాట్ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే ఎస్సై జి మాలకొండయ్య కేసు దర్యాప్తు చేపట్టారు.

## రైల్వే ప్లాట్ ఫామ్ పై వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, మార్చి 20, ప్రభాతవార్త :** నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లోని నాలుగో నెంబర్ ఫ్లాట్ ఫాం పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గురువారం రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, రెండు చేతులు లేవని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి రైల్వే సీఐజి మాలకొండయ్య కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఇసనాక కుటుంబ సభ్యులను పరామర్శించిన కొండ్రెడ్డి



**నెల్లూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త** నెల్లూరు విజయ డెయిరి మాజీ డైరెక్టర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసనాక సునీల్ కుమార్ రెడ్డి ఇటీవల కాలం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి నెల్లూరు విజయ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి గురువారం కొడవలూరు మండలం యల్లాయిపాలెం గ్రామంలోని ఇసనాక కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇసనాక కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు చిమటా శేషగిరి, వైసిపి నాయకులు బట్టేపాటి నరేంద్ర రెడ్డి, అడపాల మోహన్ కృష్ణ, దేవిరెడ్డి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత చిన్నారులకు పౌష్టిక ఆహారం పంపిణీ




**నెల్లూరు, మార్చి20 ప్రభాతవార్త- విద్య** గురువారం నగరంలోని స్దానిక అబైడింగ్‌ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ ఎం.టైటస్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో భాదిత ఆనాధ చిన్నా రులకు మందులు, పౌష్టిక ఆహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఇందులో ముఖ్యఅతిధిగా మాదీనా వాచ్ ఏజన్సీస్ అధినేత, అంతర్జాతీయ మానవహక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.ఇమ్తియాజ్ పాల్గొని చిన్నారులకు పౌష్టిక ఆహార కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత అనేక సంవత్సరాలుగా బాధిత చిన్నారులకు అండగా ఉంటూ వారికి మందులు, పౌష్టిక ఆహారం పంపిణీ చేయటం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి కార్యక్ర మాలు భవిష్యత్‌లో మరిన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ లివింగ్‌స్టోన్, ఏ.జయప్రకాష్, క్రాంతి, రూత్‌బినోమి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యకు.. తెరుచుకున్న తాళాలు

### - ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు




**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ చైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల యాజమాన్యం పాఠశాల భవనానికి సంబంధించి యాజమానులకు గత రెండు సంవత్సరాలుగా అద్దె చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో బుధవారం భవన యజమాని వినీత్‌రెడ్డి పాఠశాలకు తాళాలు వేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే తాము వేలాది రూపాయలు చెల్లిం చి తమ బిడ్డలను పాఠశాలలో చేర్పించామని, ఈ నేపథ్యంలో హఠాత్తుగా పాఠశాలకు తాళాలు వేయడంతో తమ బిడ్డల పరిస్థితి ఏమిటని వారు ఆందోళన చెందారు. ఈ మేరకు శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం భవన యాజమానులతో మాట్లాడి సమస్యను సానుకూలంగా చేయడంతో ఎట్టకేలకు గురువారం పాఠశాలకు తలుపులు తెరుచుకున్నాయి. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుని తమ బిడ్డలను పాఠశాలకు పంపారు. మొత్తం మీద తొలిసారిగా శ్రీ చైతన్య పాఠశాలకు తాళాలు వేయడం కోవూరులో సంచాలనంగా మారింది

## గీతాంజలిలో మెగా ఉచిత దంత వైద్య శిబిరం



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి సదస్సులను తరచుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను, వైద్య శిబిరాలను రక్తదాన శిబిరాలను గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ మహ్మద్ అనీభేగ్, ఆర్థో డెంటిస్ట్ డాక్టర్ రాహీలా ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు , 150 మంది అధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి దంత పరీక్షలు నిర్వహించి దంతాల ఆరోగ్యం పట్ల పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై. మురళీకృష్ణ, విద్యార్థులు ఉన్నారు.

## గృహ నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని కాలనీల్లో ప్రస్తుతం గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపడుతున్న ఎస్సీ, బీసీ లబిదారులకు రూ. 50 వేలను అదనంగా మంజూరు చేసిందని, అదేవిధంగా ఎస్టీ లబ్దిదారులకు రూ. 75 వేలు అదనంగా చేసిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా లబ్దిదారుల్లో ప్రత్యేకంగా అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, తదితరులు ఉన్నారు.

## నవనీతం పార్థివ దేహానికి నివాళులర్పించిన డాక్టర్ నాయుడు



**కావలిరూరల్, మార్చి20 ప్రభాతవార్త** ప్రముఖ హోమియోవైద్యులు డాక్టర్ నక్కా అరుణ కుమారి తల్లి స్వర్గీయ నక్కా నవనీతం స్వర్గస్తులైనారు. కావలి రామ్మూర్తిపేట సాయిబాబా గుడి సమీపంలోని వారి స్వగృహంనందు ఆమె పార్థివదేహాన్ని మాజీ మున్సిపల్ ఛైర్మన్, ప్రజా వైద్యులు డాక్టర్ యన్.ప్రభా కర్‌నాయుడు గురువారం సందర్శించి, పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఆమె మృతికిగల కారణాలను ఆమె కుమార్తె డాక్టర్‌నక్కా అరుణ కుమారి, కుమారులు నక్కా మనోహర్, నక్కా వెంకటసుధీర్‌లను అడిగి తెలుసుకుని వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యన్.ప్రభాకర్‌నా యుడు వైద్యశాల పిఆర్‌ఓ అక్కిలిగుంట ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కొల్లుని కలిసిన రవిచంద్ర



**నెల్లూరు, మార్చి 20, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని విజయవాడలోని ఆయన నివాసంలో రవీంద్రతో మర్యాదపూర్వకంగా బీద రవి చంద్ర యాదవ్ గురువారం భేటీ అయ్యాడు. శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావడంలో సహకరించినందుకు కొల్లు రవీంద్రకి, బీద రవిచంద్ర ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశాడు. ఈ సందర్భంగా రవీంద్రని రవిచంద్ర శాలువా కప్పి పుష్ప గుచ్ఛాలు అందజేసి సన్మానించారు. అనంతరం రవిచంద్రకి మంత్రి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## తహశీల్దార్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



**వరికుంటపాడు ,మార్చి 20, ప్రభాతవార్త** స్థానిక తహశీల్దార్ కార్యాలయంను కందు కూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఆక స్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. రెవెన్యూ పరంగా ఉన్నటు వంటి సమస్యలను అడిగి తెలుసుకు న్నా రు. పలు రికార్డులను పరిశీలించారు. అ నంతరం మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రా మంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీని విచారణలో భాగంగా గ్రామంలో పర్యటించి ఆ భూమిని పరిశీలించారు. పెద్దిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 231/1 లో ఉన్న రెండు ఎకరాల భూమిపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించి, ఫిర్యాదుదారుడుతో మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మా భూమి యొక్క పూర్తి వివ రాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ ఎన్.చెంచయ్య, కార్యాలయ సీనియర్ జూనియర్ సహాయకులు శ్రీనివాసరావు, సుభాని, వీఆర్వో నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సంగంలో సందడి చేసిన ప్రముఖ సినీ నటులు తనికెళ్ళ భరణి



**సంగం మార్చి 20 ప్రభాతవార్త** సంగంలో అసుర సంహారం అనే షూటింగ్‌ని ప్రారంభించారు. ఈ షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రముఖ సిని నటులు తనికెళ్ళ భరణివచ్చారు. సంగం శివాలయంలో, తెలుగు ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్ నివాసంలో అసురసం హారం సినిమా షూటింగ్ నిర్వహిం చా రు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కామా క్షిదేవి సమేతుడైన సంగమేశ్వరుడి సన్నిధిలో మొదటి షాట్‌ను తీశారు. ఈ సందర్భంగా నటులు తనికెళ్ళ భరణి మాట్లాడుతు పవితపుణ్యక్షేత్రమైన సంగమేశ్వరుడ్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పరశరాముడు స్థాపించిని ఈశివలింగానికి బ్రహ్మముడి కూడా ఉందని తెలిపారు. ఇటువంటి శివలింగాలు రుషులు మాత్రమే ప్రతిష్టారని ఆయన తెలిపారు. నెల్లూరుతో తనకు ఎంతో అనుబంధం ఉందని అన్నారు. ఈ సినిమా కి దర్శకుడుగా కృష్ణకిశోర్ వ్యవహారించారు. షూటింగ్ తిలకించేందుకు సంగం ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

## డైరక్టర్ తాళ్ళనరసింహస్వామి దంపతుల్ని సన్మానించిన అభిమానులు



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త** జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం మా అధ్యక్షులు జాగాబత్తిన శైలేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర చేనేత నామినేటేడ్ పదవుల్లో డైరక్టర్ పదవి పొందిన తాళ్ల నరసింహస్వామి దంపతుల్ని వారి ఇంటి వద్ద గజమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాళ్ళ నరసింహస్వామి మాట్లాడుతు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆశీస్సులతో తనకు పదవి లభించిందని ఆయన ప్రత్యేకంగా దన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో యర్రా ధనుంజయ, చప్పరం మల్లికార్జునరావు, మారెం మురళీకృష్ణా, పడవల శ్రీనివాసులు, గుంటూరు ప్రసాద్, పముజుల ఉమామహేశ్వరరావు, ధోని పత్తి వెంకటరమణయ్య, వారి కుటుంబసభ్యులు బుచ్చిరెడ్డిపాళెం దేవంగ ఆడపడుచులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం : ఎమ్మెల్యే



**బుచ్చి మార్చి 20 ప్రభాతవార్త** రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్దితిలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని రామకృష్ణ నగర్‌కి చెందిన అండగుండ హరీష్ కుటుంబానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 8 లక్షల విలువగల లెటర్ ఆఫ్ క్రెడిట్‌ని అందజేసింది. హరీష్ ప్రస్తుతం నెల్లూరు అపోలో హాస్పటల్‌లో ప్రాణాపాయ స్దిలో వుండగా అత్యవసర వైద్య సేవలకు 10 లక్షలు అవసరమని డాక్టర్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశలా సందర్భంగా విజయవాడలో వున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వద్ద హరీష్ కుటుంబ సభ్యులు గోడెళ్ళ బోసుకోగా వెంటనే స్పందించిన ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి పరిస్థితి వివరించారు. అత్యవసర వైద్య చికిత్స కోసం 8 లక్షల రూపాయాలు లెటర్ ఆఫ్ క్రెడిట్ సాధిం చారు. బాధితుడి సమీప బందువు వాకాటి శివరామకృష్ణకు 8 లక్షల రూపాయాలు లెటర్ ఆఫ్ క్రెడిట్ అంద జేశారు. ఆపదసమయంలో ఉన్న తమకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డికి హరీష్‌కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా "వేములపాటి అజయ్‌కుమార్" జన్మదినోత్సవ వేడుకలు




**నెల్లూరు, మార్చి20 ప్రభాతవార్త-విద్య** గురువారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పేదలను చీరల పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు చిరు అభిమానులకు, జనసేన కార్యకర్తలకు వారధిలా ఉంటూ అందరిని ఒకే తాటిపైకి తీసుకువచ్చిన ఘనత వేములపాటికే దక్కుతుందన్నారు. జిల్లా జనసేన పార్టీకి గత ఎన్నికలో దిశానిర్దేశం చేసి ఎన్నికల్లో విజయం సాధించటంతో ఆయన కీలక భూమిక పోషించారన్నారు. వ్యకి గతంగా ఎన్నో పని భారాలు ఉన్నా కేవలం జనసేనాని పవన్‌కళ్యాణ్‌పై ఉన్న అభిమానంతో పార్టీని బలేపేతం చేసేందుక అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వేములపాటి అని కొనియాడారు. ఆయన కఠోర శ్రమని గుర్తించిన అధినాయకత్వం రాష్ట్ర టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించి గౌరవించటం జరిగిదన్నారు. టిడ్కో ఛైర్మన్‌గారాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కూడా జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఆయన బాధ్యతలు నిర్వహించటం గర్వకారణమన్నారు. రానున్న రోజుల్లో వేమటపాటి అసెంబ్లీలో అడుగుపెట్ట ప్రజలకు సేవ చేయాలని, ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యులు గునుకుల కిషోర్, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, రాష్ట్ర నాయకులు ఏటూరి రవికుమార్, అధికారప్రతిధి కాంపూడి కృష్ణారెడ్డి, రూరల్ ఇన్‌చార్జ్ పావుజెని చంద్రశేఖర్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, గుర్రం కిషోర్‌బాబు, శేఖర్, నందిని, తదితరులు పాల్గొన్నారు.

**వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు:** రాష్ట్ర టిడ్కోఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌జన్మదినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని స్దానిక వినాయకుని ఆలయంలో ఆ పార్టీ నాయకులు , కార్యకర్తలు ప్రత్యేక పూజలు గావించారు. 101 టెంకాలయు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంల కాకుమురళీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, కృష్ణారెడ్డి, నూనెమల్లిఖార్జునయాదవ్, పాల్గొన్నారు.

# డొంకను దిగ మింగిన రాబంధువులు

### -ఏకంగా రొయ్యలు గుంట నిర్మాణం
### -పట్టించుకోని రెవెన్యూ అధికారులు



**వెంకటాచలం, మార్చి 20, ప్రభాతవార్త:** దశాబ్దాల కాలంగా పంట పొలాలకు వెళ్లే మోమిడి పడవ రేవు డొంకను ఆక్రమించి రొయ్యల సాగు నిర్మాణం చేపడుతున్న రెవిన్యూ అధికారులకు స్థానిక గ్రామస్తులు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారుమండల పరిధిలోనే తిరుమలమ్మ పాలెం గ్రామంలో మోమిడి పడవ రేవుకు వెళ్లే డొంక, గుండా నిత్యం రైతులు ,రైతు కూలీలు వ్యవసాయ పనులు సాగిస్తుంటారు. అలాంటి డొంకను గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి ఏకంగా రొయ్యల గుంటలు నిర్మాణం చేపట్టిన స్థానిక గ్రామస్తులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. రొయ్యల గుంట నిర్మాణంతో సమీపంలో ఉన్న వరి పొలాలు, మిరప తోటల్, పంట దిగుబడి రాక, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తమ గోడును ఎల్లపుచ్చుకున్నారు. డొంక ఆక్రమణ నిర్మాణం పై రెవెన్యూ అధికారులుకు గ్రామ సభలో రైతులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఈ రొయ్యల గుంటల నిర్మాణం కారణంగా గుంటలో నుంచి నీరు డొంకకు రావడంతో వరి ధాన్యం తెచ్చుకునేదానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. డొంకఆక్రమణ పై విచారణ జరిపి న్యాయం చేయాలనిలేని పక్షంలో జిల్లా కలెక్టరుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి దృష్టికి వెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడుతామని గ్రామస్తులు, రైతులు తెలిపారు.

## నూతన పరిశ్రమల్లో స్థానిక యువతకు ఎక్కువ శాతం ఉపాధి కల్పించాలి

### - శాసన మండలిలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త** రాష్ట్ర తలసరి ఆదాయం, కొనుగోలు, జిఎస్‌డిపి పెరగడం ఎంతో సంతోషం దీనికి కారణం 2006 లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విశాఖపట్నం, శ్రీ సిటీ, కృష్ణపట్నం సెజ్ లను తీసుకొని రావడమేనన్నారు. పరిశ్రమల స్థాపనకు అనువుగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రాజశేఖర్ రెడ్డి రెండు పోర్టులను తీసుకువచ్చి ఏపీని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించారని తెలిపారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏపీని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు నాలుగు పోర్టులు, ప్రారంభించారని తెలిపారు. ఇలా ఆంధ్రప్రదేశ్లో విప్లవాత్మకమైన మార్పులు రాజశేఖర్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మాత్రమే జరిగాయన్నారు. అలాగే విద్య వైద్యం, రెండు అభివృద్ధి చెందితేనే.. రాష్ట్రం అన్ని విధాల ముందుకు పోతుందని వైయస్ జగన్మోహన్ రెడ్డి భావించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ వార్డు సచివాలయాలు, 17 నూతన వైద్య కళాశాలలు, ఇలా అనేక మార్పులు తీసుకురావడంతో ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడి, పరిశ్రమలు రావటానికి అనువైన వాతావరణం ఏర్పడిందన్నారు. అంతకుముందు ప్రభుత్వాల కంటే వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఎక్కువ పెట్టుబడులు వచ్చి తక్కువ ల్యాండ్‌ను వినియోగించుకుని పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ప్రస్తుతం అన్ని అభివృద్ధి చెంది ఏపీ పరిశ్రమల స్థాపనకు అనువుగా మారిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం పెరిగినప్పటికీ పేదరిక నిర్మూలన, పూర్తిగా జరగ లేదన్నారు. పేదరికం పోవాలంటే పూర్తి స్థాయిలో పరిశ్రమల స్థాపన జరగాలన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో మంత్రులు దావోస్ లో పర్యటించి పరిశ్రమల స్థాపనకు చర్చలు జరిగాయన్నారు. ఆ చర్చలు సఫలీకృతమై ఏపీలో మరిన్ని పరిశ్రమలురావాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు ఏర్పాటులో ఎక్కువ శాతం స్థానికులకే ఉపాధి అవకాశాలు దక్కే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులకు ఉద్యోగ కల్పనతో పాటు ఉద్యోగ భద్రత కూడా ఉండాలని వారందరికీ కనీసం వేతనం అందే విధంగా చర్యలు తీసు కోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రైస్ కార్డులకు ఈ కేవైసీ తప్పనిసరి



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 20, ప్రభాతవార్త** ప్రభుత్వ ఆదేశాలు మేరకు రైస్ కార్డులోని ప్రతి ఒక్క సభ్యుడు తప్పని సరిగా, ఈకేవైసీ చేయించుకోవాలని అందువల్ల రేషన్ కార్డులోని ఏ లబ్ధిదారుడు ఈకేవైసీ జరిగి యుండని వారు తప్పనిసరిగా జివిస్‌డబ్ల్యూఎస్‌లను , ఎఫ్పి షాప్ డీలర్లను సంప్రదించి ,ఈకేవైసీ చేయించుకోవాలని ,జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అయితే5 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారికి మత్రము మినహాయింపు ఇవ్వడమైనది. ఈకెవైసి కానీ లబ్దిదారుల సమాచారం యఫ్ పీ షాప్ డీలర్, తహశీల్దారు, పౌరసరఫరాల అధికారి వారి లాగిన్ నందు లభ్యముగా వున్నది. ఈ విదముగా అందరూ లబ్దిదారులు తప్పని సరిగా, ఈకేవైసీ చేయించు కోవాల్సిందిగా పౌరసరఫరాల అధికారి అంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

## 23న కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం, ట్రై సైకిల్స్ పంపిణీ



**నెల్లూరు రూరల్, మార్చి 20, ప్రభాతవార్త** వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం భారీ స్థాయిలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్న పనులుహాజరు కానున్న ఎంపీవేమిరెడ్డి, మంత్రి ఆనం రామనా రాయ ణరెడ్డి దివ్యాంగులకు ఆసరా గా నిలిచేందుకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చేపడు తున్న ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఆత్మ కూరుకు చేరుకుంది. ఈ నెల 23న ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిగారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనుండగా.. ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. అదేవిధంగా నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిం చనున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిఅన్ని నియోజకవర్గాల్లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పా టు చేసి, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అదేవిధంగా నియోజకవర్గవ్యాప్తంగా దివ్యాంగులను గుర్తించి వారికి విపి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలువైన ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు అందిస్తున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే కోవూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో ట్రై సైకిళ్ల పంపిణీ పూర్తి చేశారు. అలాగే ఆయా నియోజ కవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు విజయవంతంగా నిర్వహించగా భారీ స్థాయిలో నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేశా రు. ఇప్పటివరకు ఈ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 500 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. ఇక ఆత్మకూరు నియో జకవర్గానికి సంబంధించి ట్రై సైకిళ్లపంపిణీ, ఆత్మీయసమావేశం 23న ఆదివారం ఉదయం 10:00 గంటలకు ఆత్మకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్ నందు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 150 మందికి పైగా ట్రై సైకిళ్లు అందించనున్నారు. ఆత్మకూరులో కార్యక్రమ నిర్వహణ కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రౌండ్ క్లియరెన్స్ చేశారు. జేసీబీలు పెట్టి మైదానాన్ని శుభ్రం చేశారు. షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. ట్రై సైకిళ్ల పంపిణీకి, ఆత్మీయ సమావేశానికి వేర్వేరుగా వేదికలు నిర్మిస్తున్నారు. సమావేశాలకు వచ్చేవారి కోసం ప్రత్యేకంగా భోజన వసతి కల్పిస్తున్నారు. ట్రై సైకిళ్ల లబ్ధిదారులకు ఉదయం టిఫిన్ కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

## ఏఎస్‌పేట సచివాలయంపై దాడి




**అనుమసముద్రంపేట, మార్చి20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న సచివాలయాన్ని కొందరు వ్యక్తులు గురువారం ధ్వంసం చేశారు. గ్రామంలో మానసిక రోగుల సంరక్షణా కేంద్రం నడుపుతున్న షరీఫ్ మద్యం మత్తులో సచివాలయ ఆవరణలోకి ప్రవేశించి సచివాలయం కిటికీల అద్దాలను ధ్వంసం చేశాడని ఏఎస్‌పేట సచివాలయ కార్యదర్శి షేక్ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి సమయంలో షరీఫ్‌తోపాటు గండువారిపల్లికి చెందిన మస్తాన్‌తో సహా మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లుగా కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఫీల్డ్ అందుకున్న ఎమ్మెల్యే



**కోవూరు, మార్చి 20 ప్రభాతవార్త :** విజయవాడలోని ఇందిరాగాంధి స్టేడియం మిని అసెంబ్లీని తలపించింది. రెండు రోజుల పాటు జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడా సంబరాలు నేటితో ముగి శాయి. "టగ్ ఆఫ్‌వార్" క్రీడలో విజయం సాధించిన కోవూరు ఎమ్మెల్యే టీంలోని మహిళా సభ్యులైన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రంబాబు నాయుడు చేతుల మీదుగా షీల్డ్ అందుకుంన్నారు. శాసనసభలో ఆరోపణలు ప్రత్యారోపణలతో నిత్యం బిజీబిజీగా వుండే తమకు ఈ క్రీడా ఉత్సవాలు సరికొత్త అనుభూతి నిచ్చాయన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్రీడాసంబరాల ముగింపు సందర్బంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముంఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు గారితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సభాపతి, ఉప సభాపతులు అయ్యన్న ప్రాత్రుడు, రఘు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ పాస్ నిర్మించాలని కేంద్ర మంత్రికి వినతులు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 20, ప్రభాతవార్త** నెల్లూరు నగరం లోని చిల్డ్రన్స్ పార్కు మీదుగా చింతారెడ్డిపాలెం కు వెళ్ళే దారిలో వున్న జాతీయ రహదారి వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం, యా క్సిడెంట్లు జరుగుతున్న దృష్ట్యా అండర్ పాస్ నిర్మించాలని కోరు తూ తేది: 30. 10.2024న సదరు విషయమై యం. గురు మూర్తి లంకా దినకర్, కేంద్ర మంత్రివర్యులు నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అదే విధంగా నేడు 20 మహబూబ్ నగర్ యం.పి డి.కె. అరుణ కూడా చింతారెడ్డిపాలెం వద్ద అండర్ పాస్ విషయమై కేంద్ర మంత్రివర్యులు నితిన్ గడ్కరి దృష్టికి తీసుకెళ్ళడముతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి అండర్ పాస్ మంజూరు చేస్తామని తెలిపారని ఆనం అరుణమ్మ, చైర్ పర్సన్, జిల్లా ప్రజా పరిషత్, ఆనం అరుణమ్మ, తెలిపారు.